# ఏఎమ్‌యులో వివాదాన్ని రేపిన హిందూ మతతత్వ శక్తులు

**అలీగఢ్** ముస్లిమ్ యూనివర్శిటీ(ఏఎమ్‌యు) తిరిగి మరోసారి హిందూమతతత్వ శక్తులకు లక్ష్యంగా మారింది. హిందూ యువవాహిని మరియు ఏబివిపికి చెందిన గూండాలు మే 2వ తేదీన ఏఎమ్‌యులోకి చొచ్చుకువచ్చారు. 1938 నుండి ఏఎమ్‌యు ప్రాంగణంలో నెలకొల్పబడివున్న మహ్మదాలీజిన్నా చిత్రపటాన్ని అక్కడినుండి తొలగించాల్సిందిగా వారు డిమాండ్ చేశారు. ఏఎమ్‌యు విద్యార్థులు వీరి చర్యను ప్రతిఘటించటంతో, వీరు హింసాత్మక చర్యలకు తెగబడ్డారు. విద్యార్థులపై దాడులకు పాల్పడిన గూండాలను అరెస్ట్ చేయడానికి బదులుగా పోలీసులు, తమపై జరిగిన దాడిని గురించి ఫిర్యాదు చేయడానికి వెళ్తోన్న విద్యార్థులపై లాఠీఛార్జీ జరిపి, భాష్పవాయువు ప్రయోగించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ హిందూ మతతత్వ గూండాల కోర్కెకు బాహాటంగా మద్దతు తెలపగా, ఆయన మంత్రివర్గంలోని కార్మికశాఖామంత్రి అయిన మరొక 'స్వామి' జిన్నాను 'మహాపురుషుని'గా పేర్కొన్నాడు.

కాంగ్రెస్ చరిత్రకారులు భారత ఉపఖండంలో విభజనకు జిన్నా కారణమని ఆరోపిస్తుండగా, బిజెపికి ముందు రూపాలైన జనసంఘ్ వంటి అతి–మితవాదశక్తులు నెహ్రూ, గాంధీలపై కూడా అదే ఆరోపణ చేస్తున్నారు. గాంధీ లేక జిన్నాలు ఒకవేళ సరైన వైఖరులు తీసుకుని వున్నట్లయితే, విభజన నివారించబడివుండేదన్న విధంగా వీరి వాదనలున్నాయి. వీరిరువురి వాదనలూ బ్రిటిష్ వలస పాలకుల కుట్రపూరిత స్వభావాన్ని విస్మరిస్తున్నాయి. ఉపఖండంలోని ప్రజలను మత ప్రాదిపదికపై విభజించటానికి మూలకారకులు బ్రిటిష్ సామ్రాజ్యవాదులే. తద్వారా భారత ఉపఖండంలోని రెండు దేశాల నడుమా సాధారణ సంబంధాలు కూడా ఉండకూడదనే తలంపుతో కుట్రపూరితంగా వారీచర్యకు పాల్పడ్డారు.

ఆర్ఎస్ఎస్ మరియు వారి అనుయాయులు ఒకవైపున దేశ విభజనకు నెహ్రూ కారణమని ఓవైపున ఆరోపిస్తూనే మరోవైపున అఖండ భారత్ నిర్మాణానికి పిలుపునిస్తున్నారు. రెండు జాతుల సిద్ధాంతానికి ఎవరిపైనైనా ఆరోపణ చేయవలసివస్తే, అది మొట్టమొదట వినాయక్ దామోదర్ సావర్కారే అవుతాడు. 1923నాడే సావర్కార్ హిందువు లంతా ఒక జాతిగా బోధించాడు. కాగా, జిన్నా 1940ల తర్వాతే ఈ సిద్ధాంతాన్ని స్వీకరించాడు. అందువలన ఎవరైనా ఏమాత్రం తెలివిగా ఆలోచించినా బ్రిటిష్ వలసపాలకుల మనోభీష్టాని కనుగుణంగా మత ప్రాతిపదికపై భారతదేశ విభజన జరిగిందని అర్థం చేసుకోగలుగుతారు.

2019 పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి ఎజెండాలో భాగంగా జిన్నా చిత్రపటం యొక్క వివాదం రేకెత్తించారు. ఈ సందర్భంగా రెచ్చ గొట్టబడిన మతతత్వ భావాలను నిరంతరాయంగా నిలబెడుతూ, హిందూ ఓట్లను తమకనుకూలంగా మలచుకోవటం వారి వ్యూహం.

హెచ్‌సియు, జెఎన్‌యులలో వలెనే మరో విశ్వవిద్యాలయం ఏఎమ్‌యులో హిందూమతతత్వ శక్తులను రెచ్చగొట్టడం కోసం ఈ తరహా హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. అత్యున్నత విద్యాసంస్థలను ప్రక్కదోవపట్టించి, హింసను ప్రేరేపించి, విశ్వ విద్యాలయాలను ప్రైవేటీకరించే బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాన్ని నీరుగార్చటానికే ఈ తరహా చర్యలకు పూను కుంటున్నారు. దేశంలోని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు, ఈ నీచమైన మతతత్వశక్తుల దాడులను ఖండించాలి. ఏదో ఒక అవాస్తవం ఆధారంగా దశాబ్దాలుగా మతసామరస్యంతో జీవిస్తున్న ప్రజల మధ్య చిచ్చురేపి, ఫలితం పొందాలనుకోవటాన్ని తీవ్రంగా నిరసించాలి.

ooooo